మినీకథ

# ఈలోకానికి చెందని ఇద్దరు మనుషులు

## పులిగడ్డ విశ్వనాథరావు



"శారద ఇవాళ ఎడ్మిషన్‌కోసం వెళ్ళిన కాలేజీ ప్రిన్సిపాల్ అఘాయిత్యం చూశారా?" అంది సుందర రామయ్యగారి భార్య ఆయనతో ఆయన కారులోంచి దిగి ఇంటిలోకి అడుగుపెట్టగానే. ఆమెకు నిజంగా ఒళ్ళు మండిపోతోంది.

"ఏమిటయింది?"అని సుందరరామయ్యగారు నింపాదిగా అడిగారు.

"ఏమిటవుతుంది? మన శారదకి సైన్సు గ్రూపులో ప్రవేశం వీల్లేదని ఖచ్చితంగా అన్నాడట".

"పాపం, శారద నా కూతురు అని అతడికి తెలియదేమో".

"బాగుందండీ. బాబ్జీ తోడువెళ్ళాడుగా! నేను ఫలానా సుందరరామయ్యగారి కొడుకునని పరిచయం చేసుకుని. ఈమె నా చెల్లెలు శారద మీ కాలేజీలో సైన్సు గ్రూపులో చేరాలని అనుకుంటోందని చెప్పాడట. ప్రిన్సిపాల్ మర్యాదగా మాత్రం కూర్చోబెట్టి, శారద మార్క్సషీట్ అవీ చూసి సైన్సులో ప్రవేశం వీలులేదని పెదవి విరిచాడట. కావలిస్తే ఆర్ట్స్ గ్రూప్‌లో ఎడ్మిషన్ ఇస్తానన్నాడట. శారద సైన్సులో చేరుతానని పట్టుపట్టుకు కూర్చుంది. ఎంత బ్రతిమాలినా ససేమిరా వీలులేదన్నాడట."

"ఏమిటి ఆ ప్రిన్సిపాల్ పేరు?"

"రామస్వామిట. అతడి సాహసం చూడండి. నేను ఇందాక ఫోనుచేసి నేనెవరో చెప్పుకుని మా అమ్మాయికి ఈ ఉపకారం చేయమన్నాను. వీలులేదమ్మా అని ఫోను పెట్టేశాడు."

"నీ ప్రయత్నం నువ్వు చేశావుగా."

"అదికాదండీ. మీరు తల్చుకుంటే అతడి ఉద్యోగం క్షణంలో ఊడగలదు."

"నేను కనుక్కుంటాగా. నువ్వు అనవసరంగా ఆవేశపడకు. అసలే బి.పి. పేషంట్‌వి."

"ఆ ప్రిన్సిపాల్ వచ్చేనెలే రిటైరవుతున్నాడని బాబ్జీ తెలుసుకున్నాడు. ఎక్స్‌టెన్షన్ కోసం ప్రయత్నిస్తున్నాడట. ఆ కేసు ఎలాగూ మీదగ్గరకే వస్తుందిగా."

"ఎలాగూ వస్తుందేమిటి. నా దగ్గరే ఉంది. రికమెండ్‌చేసి పైకి పంపాలి."

"ఐతే మరేం. అతడి రోగం కుదిర్చేయండి."

"రేపే తేల్చిపారేస్తాను. మహాతలబిరుసు మనిషిలా ఉన్నాడులే. మిగతా వాళ్ళలా చేతులు నలుపు కుంటూ నావద్దకు రాలేదు. సరికదా ఎవరిచేతా సిఫార్సు చేయించుకోలేదు. కాలేజీలో రాజకీయాలు, ముఠాలు ఉంటాయిగా. అతడంటె పడనివాళ్ళు అతడిపై ఆరోపణలు కూడా చేశారు."

"ఇంకేం. ఎక్స్‌టెన్షన్ వీలులేదని మీరే కొట్టి పారేయండి. కొత్త ప్రిన్సిపాల్ వస్తాడుగా. అతడు ఎడ్మిషన్ కాదనలేడులెండి."

మర్నాడు ప్రిన్సిపాల్ రామస్వామిగార్కి ఫోను వచ్చింది. తన కూతురుకి సైన్స్‌గ్రూపులో ప్రవేశం ఎందుకు ఇవ్వలేదని సుందరరామయ్యగారు అడుగుతారు, అంతేగా అనుకున్నారు రామస్వామిగారు. జీవితంలో తాను ఎన్నడూ ఎవ్వరికీ లొంగలేదు. సిద్ధాంతాల కోసం పోరాడి మిత్రుల్నికూడా శత్రువుల్ని చేసుకున్నాడు. ఇహ తనకు ఎక్స్‌టెన్షన్ వచ్చే అవకాశం లేశమాత్రమూ లేదు. తన నిజాయితీ కొంతమందికి ముళ్ళుగా గుచ్చుకోవడం వలన వాళ్ళు తనపై నిందలు మోపి ప్రచారం చేస్తున్నారు. వాళ్ళకే విజయం దక్కేలా ఉంది. తాను మాత్రం ఏమిచేయగలడు?

రామస్వామిగారు ఎందుకైనా మంచిదని రాజీనామా కూడా రాసుకుని జేబులో పెట్టుకున్నారు. పదవీ విరమణకు ఒక నెలముందు రాజీనామా చేయవలసి వచ్చినా పెన్షన్‌లోకాని ఇతర విషయాలలోకాని పెద్ద నష్టమేమీ రాదు.

సుందర రామయ్యగారి ఆఫీసు రూములో రామస్వామిగారు అడుగుపెట్టగానే సుందరరామయ్యగారు చిరునవ్వుతో ఆహ్వానించి ఎదుటి కుర్చీలో కూర్చోమని సైగచేశారు. ఈ మహానుభావుడు వినయంతో తన పని చేయించుకోవాలని ఎత్తులు వేస్తున్నాడు సుమా అని అనుకున్నారు రామస్వామిగారు.

"నిన్న మా అమ్మాయి శారద మీ కాలేజీకి వచ్చిందట. మీరు ఆమెకు సైన్సుగ్రూపులో ప్రవేశం వీలులేదని అన్నారట?" అని సుందరరామయ్యగారు మందహాసంతో అడిగారు.

ఎంతైనా సుందరరామయ్యగారు ఉన్నతాధికారి కదా. రామస్వామిగారు ఆవేశపడకుండా వినయంగా, "ఐ యామ్ సార్రీ, సర్. ఆమె మార్కులుకంటె బాగా ఎక్కువ మార్కులు వచ్చిన వాళ్ళనుకూడా సైన్సులో తీసుకోలేదు. ఆర్ట్సులోనే చేర్చుకున్నాం. అందుకని నిరాకరించవలసి వచ్చింది."

"అది సరేలెండి. నేను మాత్రం మీ ఎక్స్‌టెన్షన్ కేసు సిఫార్సుచేసి పైకి పంపుతున్నాను."

'ఓరి జిత్తులమారి! నా ఎక్స్‌టెన్షన్ కేసుని నీ కూతురి ఎడ్మిషన్‌తో ముడిపెట్టి నీ స్వార్థం నెరవేర్చుకుందామని అనుకుంటున్నావు కదూ! అది ఎన్నటికీ జరగదు. నువ్వు పట్టుపడితే ఇదిగో నా జేబులో దాని విరుగుడు ఉంది' అని అనుకుని రామస్వామిగారు బైటకు ఈ విధంగా అన్నారు. "అది మీ దయ, సర్. ఐ యామ్ వెరీ గ్రేట్‌ఫుల్ టు యు., కాని మీ అమ్మాయికి సైన్సులో ప్రవేశం... ..."

"వీలులేదు అంటారు. అంతేగా. రామస్వామిగారు! అందుకేగా నేను మీ ఎక్స్‌టెన్షన్‌కోసం ఫోనులో స్వయంగా పైవాళ్ళతో మాట్లాడి తప్పక ఎక్స్‌టెన్షన్ వచ్చేలా హామీ తీసుకుని, మీ ఫైలుపై కూడా గట్టిగా సిఫార్సుచేసి పైకి పంపుతున్నది. మా అమ్మాయికి నచ్చచెప్పాలెండి. శారద ఆర్ట్సులోనే చేరుతుంది. ఐ విష్ మోర్ పీపుల్ లైక్ యు ఇన్ అవర్ కంట్రీ. కీప్ ఇట్ అప్. బై బై."

రామస్వామిగారు తనమతానే నమ్మలేకుండా బైటకు నడిచారు.

*